క్లుప్తంగా

కాలె యాదయ్యకు నిరసన సెగ

రోడ్డు పనులు చేయించాలని ప్రచారాన్ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి: ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎమ్మెల్యే అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యకు గ్రామాల్లో నిరసన సెగ ఎక్కువ అవుతున్నాయి. మండలంలోని జనవాడ గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ప్రచారం నిర్వహించేందుకు వస్తే గ్రామస్తులు అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. మండలంలోని జనవాడ గ్రామం నుంచి మహారాజ్‌పేట్ వెళ్లే రోడ్డును మరమ్మతులు చేయాలని గ్రామస్తులు గతంలో కోరారన్నారు. ఈ విషయంలో గ్రామ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు వెంటనే జనవాడ–మహారాజ్‌పేట్ రోడ్డులో జేసీబీతో చదును చేయిస్తున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



టంగటూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపా రావు పేర్కొన్నారు. చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి యాదయ్యకు మద్దతుగా టంగటూరు గ్రామంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్, మండల ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియమ నిబంధనలు పాటించండి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం



సమావేశంలో ఎన్నికల అధికారి సాయిరాం

చేవెళ్ల: ఎన్నికల నియమ నిబంధనలను రాజకీయ నాయకులు పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరాం తెలిపారు. చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం అన్ని రా జకీయ పార్టీల నాయకులతో ఎన్నికల నిబంధ నలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భ ంగా రేపటి నుంచి నిర్వహించే నామినేషన్ల ప్ర క్రియకు సంబంధించిన అంశాలపై రాజకీ య నాయకులకు సరైన అవగాహన ఉండాలని చెప్పారు. నామినేషన్ పత్రాలను నింపే ముందు ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా చదివి పూ రించాలన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించి కూడా అభ్యర్థులు ఖచ్చితమైన సమాచారం పూర్తి చేయాలని, ఎన్నికల ఖర్చుల వివరాల ఖాతాలను చూపించాలన్నారు. ఎడైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని కోరారు.

సిద్ధయ్యకు డాక్టరేట్ పట్టా అందజేత

చేవెళ్ల: మండలంలోని న్యాలట గ్రామానికి చెందిన పుప్పల సిద్ధయ్య ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నాడు. బుధవారం ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై డాక్టరేట్‌ను అందజేశారు. 'తెలంగాణ దినపత్రిక భాషా పరిశీలన ప్రయోగం' అనే అంశాంపై ఆయన గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నట్లు తెలిపారు. ఈ అవార్డు రావటం ఎంతో సంతోషంగా ఉందని సిద్ధయ్య తెలిపారు. సామాన్య రైతు కుటుంబం నుంచి పీహెచ్‌డీ వరకు వెళ్లిన అతన్ని మండల ప్రజలు, నాయకులు అభినందించారు.

కాంగ్రెస్‌దే అధికారం



కాంగ్రెస్‌లో చేరిన మహారాజ్‌పేట్ బీఆర్‌ఎస్ నాయకులు

శంకర్‌పల్లి: కాంగ్రెస్‌దే అధికారమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి అధికారం కై వసం చేసుకోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మండల పార్టీ ప్రచార కార్యదర్శి బద్రి శ్రీకాంత్, మహారాజ్‌పేట్ అధ్యక్షుడు రజినీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. మున్సిపల్ అధ్యక్షుడు వై.ప్రకాశ్, రవిందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, బల్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ప్రజలు నమ్మరు



చేవెళ్ల: కమ్మెట గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

- కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్
- గొల్లగూడ, కమ్మెట, మన్‌మర్రి, బోడంపహాడ్, అంతారం, కుర్వగూడ, సర్దార్‌నగర్, కక్కులూర్, కేసారంలో ఎన్నికల ప్రచారం
- చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు



షాబాద్: మన్‌మర్రి ఎన్నికల ప్రచారంలో భీంభరత్

చేవెళ్ల: నియోజకవర్గంలో ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని, కాంగ్రెస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ శైలజ, మహిళ అధ్యక్షురాలు సమత, సరితలు పేర్కొన్నారు. గొల్లగూడ, కమ్మెట గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్‌కి ఓటు వేయాలని వారు అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామాల్లో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2,500లు 4వేల పింఛన్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆరు గ్యారంటీలను పక్కగా అమలు చేసి తీరుతుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణరెడ్డి, పీసీసీ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: కేసీఆర్‌ను ప్రజలు నమ్మరని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బొందపెట్టడం ఖాయమని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. షాబాద్ మండల పరిధిలోని మన్‌మర్రి, బోడంపహాడ్, అంతారం, కుర్వగూడ, సర్దార్‌నగర్, కక్కులూర్, కేసారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మహిళ అధ్యక్షురాలు అశ్విని, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, బీసీసెల్ అధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి..

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని పామెన భీంభరత్ పేర్కొన్నారు. మాచన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మోముల సత్తిరెడ్డి కుమారుడు మోముల మాణిక్యరెడ్డి తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: బీఆర్‌ఎస్ పాలనతో ప్రజలు విసిగి పోయారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని పామెన భీంభరత్ అన్నారు. చిలుకూరు, చందానగర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు చిలుకూరు బాలాజీ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ భీంభరత్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లాలన్నా రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, చదువుకున్నవారికి ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్య, కీసరి సంజీవరెడ్డి, మోత్కుపల్లి రాములు, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



బోధునంపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: ఎన్నికల్లో గెలిపించి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. చౌలపల్లి, బోధునంపల్లి, లేమామిడి, నిర్దవెళ్లి, తొమ్మిదిరేకుల, లింగంధన గ్రామాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడారు. పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉండి ఎక్కడ అవినీతికి పాల్పడలేదని, గుంట భూమి కొనుగోలు చేయలేదని, తనపై అవినీతి ఆరోపణలు లేవన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్సీడీపై రూ.400లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని అన్నారు.

పార్టీలో చేరికలు...

కేశంపేట గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కళమ్మ, శ్రీశైలంగౌడ్, పార్వతమ్మ, సావిత్రి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడటం సరికాదు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్



పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు

షాద్‌నగర్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడటం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను నిరసిస్తూ పాలస్తీనాకు మద్దతుగా షాద్‌నగర్ పట్టణ చౌరస్తాలో సంఘీభావం ప్రకటిస్తూ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ దాడులను వెంటనే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైలారం జంగయ్య, రాములు, రమేశ్, రెడ్యా, రవి, చంద్రయ్య, రాములు, కృష్ణ, అంజి, టీకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి



షాద్‌నగర్: కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్‌ను నమ్మితే ప్రజలు అధోగతి కావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఉప్పరిగడ్డ, వెంకట్‌రెడ్డి, కొత్తూరు మండలం నుంచి వివిధ పార్టీలకు చెందిన సుమారు 100మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ ఎన్నికలు నేపథ్యంలో బీఆర్‌ఎస్ నేతలు ప్రజలను మోసం చేసేందుకు అనేక హామీలు గుప్పిస్తున్నారన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారన్నారు. జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శంకర్ నాయక్, భాను, రమేశ్, ఆంజనేయులు, శేఖర్ గుప్తా, జంగయ్య, గణేశ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలం



పార్టీలో చేరిన కేతిరెడ్డిపల్లి మైనార్టీ నాయకులు

మొయినాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్‌కు ప్రజలే బలం అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మైనార్టీ, ఇతర పార్టీల నాయకులు సర్పంచ్ శోభా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. 60 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీపీ నక్షత్రం జేవంతు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మక్తాల సురేందర్‌గౌడ్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, జెల్లెల మల్లేశ్ యాదవ్, కేతిరెడ్డి పల్లి నాయకులు పాల్గొన్నారు.

మదాసి కురువల వినతి

కొందుర్గు: మదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మదాసి కురువ సంఘం నాయకులు బుధవారం జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మదాసి కురువలకు ఇప్పటికే అన్ని చోట్ల ఎస్సీ సర్టిఫికెట్లు ఇస్తున్నారన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామాల మదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న పామెన భీంభరత్

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదని, కేసీఆర్‌ను గద్దె దించేందుకు సిద్ధమయ్యారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. బుధవారం పార్టీ కార్యలయంలో జరిగిన సమావేశంలో చేవెళ్లకు చెందిన గుంజిర జంగయ్య, శ్రీశైలం, సత్యనారాయణ, దర్శన్, నరేశ్, తదితరులు పట్టణ అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామాల్లో పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీని వ్యతిరేకిస్తున్నారని భీంభరత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అతివేగం

రోడ్డు ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: అతివేగంతో విద్యుత్ పోల్‌ను ఢీకొట్టిన ఓ బైకిస్టు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ప్రమోద్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాసం ఉంటూ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం తెల్లవారుఝామున ప్రమోద్ జయసూర్యపట్నం నుంచి నాదర్‌గుల్ రోడ్డులో బైక్‌పై అతివేగంగా వస్తుండగా రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ప్రమోద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాహుల్‌గాంధీ సభకు తరలిన నాయకులు

కొత్తూరు: షాద్‌నగర్ పట్టణంలో బుధవారం నిర్వహించిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభకు మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. మండలంతో పాటు మున్సిపాలిటీ నుంచి నాయకులు బైకులతో పెద్ద ఎత్తున వెళ్లారు.



బైకుర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్‌ఎస్‌తోనే భవిష్యత్



ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యల సమక్షంలో పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

- చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌తోనే యువతకు భవిష్యత్ ఉంటుందని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య స్థానిక నాయకులతో కలిసి భారీ ర్యాలీతో ప్రచారం చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ నత్తి క్రిష్టారెడ్డి, బీసీ యువ నాయకుడు గుత్తి మల్లేశ్, చిన్నెంకి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు బీర్ల నర్సింలు, గుత్తి సుధాకర్, ప్రభాకర్, బాలయ్య, కుమార్‌లతోపాటు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఎలాంటి అభివృద్ధి చేయకపోయి ఉంటే ఇంత పెద్ద ఎత్తున మహిళలు, ప్రజలు బీఆర్‌ఎస్‌కు స్వాగతం పలికేవారా? అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంకోసం ఎన్నో మాయ మాటలు చెబుతున్నాయని వాటిని నమ్మొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం. విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం. మాలతి, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, పార్టీ మండల నాయకుడు ప్రభాకర్, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో ఎన్నికల ప్రచారం..

మండలంలోని అల్లవాడ, జాలగూడ, గుండాల, సాయిరెడ్డిగూడ, లక్ష్మీగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యను మరోసారి ఆశీర్వదించాలని, ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను వారు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, గణేశ్, యాదిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'గా పథకాలు అమలు

- కాంగ్రెస్ పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్



నియామక పత్రం అందజేస్తున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలన్నీ గ్యారంటీగా అమలు చేస్తుందని పీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ అన్నారు. హిమాయత్‌నగర్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుర్రకాయల రమేశ్ ముదిరాజ్‌ను నియమించారు. ఈ సందర్భంగా షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణయ్యలు రమేష్‌కు నియామకపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లుగా అభివద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మ్యానిఫెస్టోను కాపీ కోట్టి మోసం చేస్తుందన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నర్సింహ్మా, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నూతన కమిటీ...

హిమాయత్‌నగర్ అధ్యక్షుడిగా బుర్రకాయల రమేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా జావిద్, ప్రధాన కార్యదర్శిగా కంజర్ల శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంగెం రాజు, యూత్ అధ్యక్షుడిగా కంజర్ల నవీన్, ఉపాధ్యక్షుడిగా సుమన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో మేలు

మండల పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి



టీకాలు వేస్తున్న శ్రీలతరెడ్డి

మొయినాబాద్‌రూరల్: మేకలు, గొర్రెలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తే రైతులకు మేలు కలుగుతుందని మండల పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి అన్నారు. అంతేకాకుండా వాటి పోషణతో ఆర్థికంగా అభివద్ధి చెందొచ్చని తెలిపారు. మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో 1,668 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ వరకు ఈ టీకాల పంపిణీ ఉంటుందని సూచించారు. మేకలు, గొర్రెలకు ఈ టీకాలు ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. రైతులు, మేకలు, గొర్రెల పెంపకందారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారులు దేవీరెడ్డి, అహ్మద్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఓరియంటేషన్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జయంత్‌నాయుడు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని గుంతపల్లిలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలోని అవంతి ఎంబీఏ, ఎంసీఏ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఎంఏ ప్రెసిడెంట్ జయంత్‌నాయుడు, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, కార్యదర్శి రంగారావు...హెచ్‌సీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ సప్నా సింగ్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రస్తుత వ్యాపార దిగ్గజాలు విద్యార్థుల నుంచి ఎలాంటి నైపుణ్యాలను ఆశిస్తున్నారు అనే విషయాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటే



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

షాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం షాబాద్‌లో బీజేపీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా నిరంకుశ, నియంత, అవినీతి పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కార్‌కు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. బీజేపీకి అవకాశం ఇవ్వాలని వారు తెలిపారు. బీజేపీకి మెజార్టీ స్థానాలొస్తే బీసీ అభ్యర్థే సీఎం అవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులను వారు కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమి లేదన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, శ్రీధర్‌రెడ్డి సత్యం, రాము, మానయ్య, తదితరులు పాల్గొన్నారు.